కాశ్మీర శివయోగిని

శ్రీ లల్లాదేవి వాక్కులు



అనువాదము

మల్లంపల్లి శరభేశ్వర శర్మ

Ci

YRKA108B152

కాశ్మీర శివయోగిని

శ్రీ లల్లాదేవి వాక్కులు

చి॥ ప్రియతమైన
ఎల్లాప్రగడ రామకృష్ణకు
సకలాశీస్సులతో -
[illegible]
సోమవారం 11.5.9[illegible]

అనువాదము

మల్లంపల్లి శరభేశ్వర శర్మ

Sri Lalladevi Vakkulu

Tr. : Mallampalli Sarabheswara Sarma

© **Author**

Copies : 1000

1997

With the financial assistance of :

Sivanandaguru Educational & Cultural Trust
Anandavanam - Bheemunipatnam - 531 163,
Gurudham, Near Ayyappa Temple, Mulug Road, Warangal

Price : Rs. 50/-

Copies can be had from :

M. Sarabheswara Sarma
57B, Vinayaknagar,
TIRUPATI (A.P.) - INDIA

Art : K. Surender. Hnk.

Printed at :
Laxmi Graphics
Balasamudram,
Hanamkonda - 506 001.(A.P.)
Phone : 77395

"ఎట్టి పబ్బమైన నింట సాఁగఁగనిమ్ము

'లల్ల' వంతు ముద్ద తెల్లఋాయి."

ఓం శ్రీః

అమ్మా !

ఆ కొండ చఱియ నుండి దిగుతున్న సెలయేటి గట్టున చెట్టునీడలో నాన్న గారి శివపూజకు నీవు అన్నీ అమరుస్తున్నావు.

నివేదనకు నీవు సేకరించిన అడవి పండ్లకు ఆశపడి చిలుకలు వచ్చి వ్రాలకుండా అమ్మవారి చేతి చిలుక ఆన పాడుస్తున్నది.

ఆ పరిసరాలలోని పచ్చిక బీళ్లలోనికి పల్లె పశువులు రాకుండా నందీశ్వరుడు చూస్తున్నాడు.

నీవు శివార్చనకు ఏరిన ధవళాక్షతలు దొంగిలించడానికి కలుగులలో పొంచి ఉన్న మూషికములు వెలుపలికి రాకుండా శ్రీ విఘ్నేశ్వర వాహనం కాపలా వేస్తున్నది.

శివుని మహానైవేద్యానికని నీవు వండిన వంటకములను తన జాతి వచ్చి కలియఁబడకుండా యోగుల ఇలువేలుపు శ్రీ భైరవస్వామి వారువము ఉరిమి చూస్తున్నది.

అమ్మా! నేనింకా ఎన్నిసార్లు పుట్టినా - ఆ అన్ని జన్మలలోనూ నీవే నాకు అమ్మవై ఉండాలి !

శ్రీ లల్లాదేవి కాశ్మీర భాషలో ఉచ్చరించిన వాక్కులను శివయోగుల కృపాబలం వల్ల నీ కోసం తెనుఁగు భాషలో పాడుతున్నాను.

శ్రీ లల్లాదేవి సన్నిధికి నీవు వేళ్లే వేళల్లో ఎడ బిడ్డనైన - నన్ను చంకకు ఎత్తుకోవటం ఎక్కడ మఱచిపోతావో అన్న బెంగతో ఈ పాటలు నీకు అంకితం చేస్తున్నాను.

సీ

"శరభం"

ధాతృ మాఖ పూర్ణిమ శుక్రవారం

(20-2-1997) "గురుధామం"

వరంగల్లు

పరిచయము

చరిత్రకందని పూర్వయుగాలలో మహర్షుల తపోవాటికలలో వారి తపస్సుల నుండి వేదావిర్భావముగా ప్రారంభమై కాలక్రమేణ వేద విజ్ఞానంగానూ, వేద ధర్మంగానూ విస్తరించి ఆర్షధర్మం త్రివిక్రమునిలాగా అనంతంగా పెరిగింది. వేద భూమికి ధర్మ క్షేత్రములు ఋషివాటికలు, దేవతాత్మకంగా వర్ణించబడిన హిమవత్పర్వతములు, ఆ పర్వత పాదసీమలు, పవిత్ర నదీ తీరములు, వీటితో నిండిన ఒక దేశం కాశ్మీరం. కలియుగ ప్రారంభంనాటికి నిన్న మొన్నటి శతాబ్దాల వరకు ఈ అతిలోక సుందర సీమ అనేక సనాతన సాంప్రదాయాల కాటపట్టై ప్రధానంగా క్రీస్తు తర్వాత శతాబ్దాలలో శైవము, యోగము, తంత్రము వీటి విస్తృత ప్రచారానికి ఈ కాశ్మీరం ఆలవాలమైనది. ఇవన్నిటితో పాటే సంస్కృత వాఙ్మయము వేదశాస్త్రముల ప్రచారము మొదలైన వాటికి కూడా స్థానీయమై ఈ కాశ్మీరము ఆది శంకరుల కాలానికి సర్వజ్ఞ పీఠానికి స్థానమై ప్రసిద్ధి పొందింది. ఎనిమిదవ శతాబ్దం వారని నమ్మబడుతున్న శ్రీ ఆది శంకరులు యావద్భారతాన్ని పర్యటించి తమవాదంతో అనేక మత సిద్ధాంతములపై విజయం సాధించి చివరకు కాశ్మీర దేశంలోని సర్వజ్ఞ పీఠాన్ని కూడా అధిరోహించి తన సర్వజ్ఞత్వాన్ని అద్వైత సిద్ధాంత పారమ్యాన్ని స్థాపించారని సాంప్రదాయం చెప్పుతున్నది. కల్హణుని రాజతరంగిణి వంటి ఉత్తమ చరిత్ర గ్రంథానికి, సోమదేవభట్టు విరచితమైన కథాసరిత్సాగరమనే అద్భుతకథా వైచిత్రికి, కల్హణ, బిల్హణ, మల్హణ మొదలైన మహాకవులకు తల్లియైన ఈ కాశ్మీరదేశము ప్రతి భారతీయుడు గర్వించి ప్రేమించదగినట్టి భరత భూఖండము.

ఈ భూలోక స్వర్గసీమలో పుట్టిన ఒకానొక అనర్ఘ రత్నమే లల్లయోగీశ్వరి. ఈమె సంపూర్ణ రాజయోగ సిద్ధిని పొంది కాశ్మీర దేశ ప్రజల చేతను. ఆమెను గురించి తెలిసిన ఇతర భారతీయుల చేతను ఈశ్వరాంశ సంభూతురాలుగా పూజింపబడి కాశ్మీర దేశ సంస్కృతిలో, నాగరికతలో, మతంలో, వాఙ్మయంలో, తాత్త్విక చింతనలో అంతర్యామియై శాశ్వత కీర్తిని పరమ పూజ్య పదాన్ని సంపాదించుకొన్నది ఈ మహాయోగిని. ఈమె 14వ శతాబ్దంలో జీవించి ఉండినదనిఅంచనా. ఈమెను కాశ్మీర భాషలో లల్లాదేడ్ అని అంటారు. లల్లాదేవి అని అర్థం. ఈమెకు లల్లాయోగీశ్వరి అనికూడా ప్రసిద్ధ నామము. శ్రీనగర్ పట్టణంలోని అనేక ప్రసిద్ధ స్థానాలు, సంస్థలు నేటికీ ఈమె పేరు

పెట్టు కుంటాయి. ఉదాహరణకు శ్రీనగర్‌లోని అతిపెద్ద ఆసుపత్రి, లల్లాదేడ్ ఆసుపత్రి అని పిలుస్తారు. ఈమె శిష్యుల లోను. భక్తులలోనూ కేవలం హిందువులు మాత్రమే కాక వేలాది ముస్లిములు, క్రైస్తవులు కూడా నేటికీ వున్నారు. కాశ్మీర దేశంలోని సుప్రసిద్ధ సూఫీ యోగపురుషుడైన నూరుద్దీన్ ఈమెకు శిష్యుడు, భక్తుడు కూడాను. ఈమె తన జీవితంలో అనేక తాత్త్విక, ధార్మిక భోదలను, యోగ రహస్యాలను కూడా ప్రబోధం చేసింది. ఆమె ఆశువుగా చెప్పిన కాశ్మీర భాషలోని శ్లోకాలు నాలుగు పాదాలు కలవిగా ప్రసిద్ధమై కాశ్మీరదేశీయులకు సంకీర్తనలో గాన యోగ్యంగా, మత ప్రవచనంలో ఉదాహరణలుగా ప్రసిద్ధమగుటయే గాక కొన్ని చోట్ల శివారాధనలో అభిషేక మందు కూడా రుద్రమంత్రములవలె ఉపయోగబడినవి. ఆమె వాక్కునుంచి వెలువడిన ఈ శ్లోకాలకు "లల్లవాక్కు" లని ప్రసిద్ధి. ఈ లల్లావాక్కులు కాశ్మీర దేశంలో ఒక పరిష్కృత గ్రంథరూపంలో అందరికీ లభించక పోవడం చేత 1920 లో సర్‌జార్జి గ్రియర్‌సన్ అను పండితుడు దొరికినంత వరకు సేకరించి ప్రకటించాడు. తరువాత కాలంలో పండిట్ ఆనంగ్ కౌల్ బామ్ జాయి అనే కాశ్మీర పండితుడు చాలా పూర్వమే సంస్కృతంలో శ్లోక రూపంగా అనువదింపబడిన గ్రంథాన్ని సేకరించి 1931 లో ప్రచురించాడు. కాశ్మీర సంస్కృత భాష భారతదేశంలోని ఇతర రాష్ట్రాల యందు ప్రచారంలో ఉన్న సంస్కృత భాష వలె కాక కాశ్మీర భాషా పదభరితమై ఉంటుంది. కాశ్మీర భాషలో అరబ్బీ, పార్సీ, మొదలైన విదేశ భాషా పదజాలం కూడా సమ్మిళితమై ఉంటుంది. ఆ భాష యొక్క లిపి పేరు "శారద". శారదా లిపిలోని లల్లవాక్కులు ఈ కారణం చేత అనేక భాషల సంబంధిత సంకీర్ణతను కలిగి ఉంటాయి. ఆమె జీవించిన 14వ శతాబ్దానికి పూర్వమే ముస్లిములు భారతదేశానికి దండెత్తిరావడం, వాళ్లతో ఆదేశపు అరబ్బీ, పార్సీలోని పండితులు, సూఫీ సంప్రదాయాలు భారతదేశం రావడం అందరికీ తెలిసినదే. వీటి ప్రభావం చేత కొన్ని దేశీయ పదాలతో కూడి సంస్కృత భాషా భూయిష్టంగా ఉండిన కాశ్మీర భాష ఇస్లాం మతస్థుల సాంస్కృతిక పదములను తనలో కలుపుకొని ఒక నూతన రూపాన్ని పొందింది.


14వ శతాబ్ది ప్రారంభానికి కాశ్మీర దేశంలో చాలా విపత్కరమైన పరిస్థితులు ప్రారంభమైనాయి. మధ్యాసియా నుండి దూల్చు అనేవాడు కాశ్మీరం పై దండెత్తి హిందూ ప్రజలను చాలామందిని చంపి ఒక నరకాన్ని సృష్టించాడు. హిందూ ధర్మంలో ఉన్న పూర్వపు రాజులు దుర్బలులై రాజ్యాన్ని వదలిపెట్టి పారిపోయారు. హిందూ సమాజం

అవినీతి పరులైన రాజులతో వారిని ఆశ్రయించిన స్వార్థపరులైన అగ్రవర్ణాల వారితో దూషితమై దుర్బలమైనది. ఇస్లాం ప్రభంజనం దేశాన్ని అల్లకల్లోలం చేసింది. ఈ శతాబ్దం ముందుకు సాగుతుండగా తైమూర్ చేత సయ్యదులనే ముస్లింశాఖవారు క్రూరంగా వెళ్లగొట్టబడి ఇక్కడకు వచ్చారు. కుతుబుద్దీన్ అనే రాజు 1373 నుంచి కాశ్మీరును పాలించాడు, కాని డుల్చు అంతకు ముందు చేసిన హిందూ వధలాంటి కార్యక్రమాలు ఇతడు చేసినట్లు లేదు. 22 సంవత్సరముల పాటు కాశ్మీరులో ఉండి కొంతవరకు ఇస్లాంను వ్యాపింపచేశారు. ఆ సయ్యదుల నాయకుడైన మీర్ అలీఅహ్మదు దృష్టిలో నవాబు కుతుబుద్దీన్ పేరుకు మాత్రమే ముస్లిమ్. అతను కాఫిర్‌లు అనగా హిందువులు వేసుకునే దుస్తులు ధరించాడట. ఇలాంటి ఘోర అపరాధాలు చేసినందుకు అతడు సరియైన ముస్లింగా గుర్తించబడలేదు. దీని నుంచి మనం గ్రహించవలసిన దేమిటంటే అతడు హిందూ సంస్కృతిని వేటాడలేదు. అయినప్పటికి సయ్యదులు తమ కాలంలో 37వేల హిందువులను ఇస్లాం మతానికి మార్చారు. అంతేకాక పర్షియన్ దేశ సంస్కృతిని చాలా మట్టుకు కాశ్మీరానికి దిగుమతి చేశారు. ఒక విధంగా శతాబ్దాంతానికి కాశ్మీరు హిందూ ముస్లిమ్ దేశంగా మారి తాత్కాలిక శాంతిని అనుభవిస్తున్నదని గ్రహించవచ్చు. లల్లాదేవి అట్టికాలానికి చెందినది.

అంతకు ముందే హిందూ సమాజం పతనావస్థలో ఉన్నది. నైతిక పతనం, మతమౌఢ్యం వల్ల హిందూ సమాజంలో చీలికలు ఉండినవి. శైవ మతం మాత్రం అంతకు ముందే ఒక ఉన్నత స్థాయికి చెంది అందులో 'త్రిక' సిద్ధాంతమనే ఒకానొక శివాద్వైత సిద్ధాంతము స్థిరపడింది. అయితే ఇది జన సామాన్యంలో వ్యాపించక కొంతవరకు అగ్రవర్ణాలలోనూ, ఉన్నత కుటుంబాలలోనూ ఉన్నదని భావించబడుతోంది. ఆ శైవ మతంలో జ్ఞాన వైరాగ్య యోగములు ప్రధానంగా ఉండినవి. అతిపురాతనమైన శివారాధన వీటితో మేళవించబడి ఒక ఉన్నత స్థాయికి చేరుకున్నది. అయితే సామాన్య హిందూ సమాజం, అందరు దేవతలను, శివ, విష్ణు, శక్తి, గణేశాది దేవతలను ఆరాధిస్తూనే ఉండేవారు. రాజకీయ పరిస్థితుల వల్ల, సామాజిక పరిస్థితులవల్ల, అవినీతి వల్ల, మూఢత్వం వల్ల, ఆంతరంగిక మత భేదాల వల్ల, ముస్లిం ప్రభంజనంవల్ల ఛిన్నాభిన్నమైన హిందూ సమాజానికి ఒక సార్వజనీనమైన బోధ, జ్ఞానము, వివేకము, నీతిబోధ ఇవన్నీ ఎంతో అవసరమైన కాలం ఏర్పడింది అప్పుడు. ఆకాలం నాటికి లల్లాదేవి ఒక యోగినిగా, జ్ఞానిగా, నీతి ధర్మాల ప్రబోధకురాలిగా సమాజాన్ని ఉద్బోధించి ధర్మాన్ని ఆదుకుంది.

ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి ఆకుటుంబంలోని సత్సంస్కారము, శౌచము, శివభక్తి జీర్ణించుకొని తరువాత అత్తవారింటికి వెళ్లి చాలా కష్టపడింది. భారతదేశంలో ఇదొక్కవింత కాదు. ఆంధ్రదేశంలోని శివభక్తురాలు హేమారెడ్డి మల్లమ్మ, మహారాష్ట్రలో సక్కుబాయి, ముక్తాబాయి, రాజస్థాన్‌లో మీరాబాయి, ఇలాగ ఎందరో స్త్రీలు సామాన్య కుటుంబాలలో ఉండే కోడంత్రికం పూర్తిగా అనుభవించి సౌమ్యులై దుర్బలుడైన భర్తను మాత్రం గౌరవించి ఈ లౌకిక జీవనం నుంచి క్రమంగా విముఖులై శివభక్తి ప్రభావం చేత పరమ విరాగిణురాలై సంఘానికి భక్తి జ్ఞాన వైరాగ్యాది మార్గదర్శకులై విలసిల్లినారు. బాల్యంలోనే సిద్ధ శ్రీకంఠుడనే శివయోగి యొక్క పరిచయము కలిగి ఆతని వద్ద కొన్ని సాధన రహస్యాలు గ్రహించినది. అత్తవారింటికి వెళ్లగానే అక్కడి ఆచారం ప్రకారం వివాహం తర్వాత ఆమె పేరు పద్మావతిగా మారింది. ఆమెకు అత్తవారింట ఆహారం కూడా సరిగా పెట్టేవారుకాదు. ఒక గుండ్రటి తెల్లని రాతికి అంతటా అన్నపు మెతుకులు అంటించి ఆమె కంచంలో పెట్టేవారు ఆ మెతుకులు ఏరుకొని తిని ఆరాయిని కడిగి మళ్ళీ వంటింట్లో పెట్టాలి. ఇదీ ఆమె దినచర్య. వారింట్లో ఒక గ్రహశాంతి జరిగింది. ఆమె ఆరగించిన విందు గురించి పొరుగింటి వారు ఆమెను హేళన చేసారు. అప్పుడామె అన్నమాటలు ఎంతో చక్కగా తెలుగులో అనువాదం చేయబడ్డాయి. "ఎట్టి పబ్బమైన ఇంట సాగగనిమ్ము, లల్ల వంతు ముద్ద తెల్ల రాయి". భర్త, మామగారు ఆమె కష్టాన్ని తరువాత గ్రహించారు.

భర్తపై అనురాగం చూపించడంలేదని, ఆమె గుణం మంచిదికాదని అపవాదువేశారు. నదికి వెళ్లి నీరు తేవడానికి ఎంతో జాగు చేయడం అనుమాన హేతువైనది. శివధ్యానంలో ఆమె మౌనంగా అక్కడ గడుపుతున్నదని తరువాత గ్రహించారు. నటకేశవ భైరవ ఆలయం వద్ద నదిని దాటి వెళ్లి ధ్యానంలో గడిపేది. ఈ మహాయోగిని జీవితంలో అప్పుడు కొన్ని అద్భుతాలు కూడా జరిగినాయి. తలపై నీళ్లకుండ మోసుకొని వస్తుండగా అత్తగారు ఆమెను హింసించడానికి కర్రతో కుండను పగుల గొట్టింది. కుండ పగిలిందికాని కుండ ఆకారంలో నీరు మాత్రము అలాగే నిలిచిపోయింది. ఇంట్లో పాత్రలన్నీ పూర్తిగా నింపే వరకూ ఆనీటి ఆకారం అలాగే ఉండిపోయింది. మిగిలిన నీరు బైట పారపోయగా అక్కడ ఒక చిన్న చెరువు ఏర్పడింది. దానికి లల్లా చెరువని పేరు. పీర్ గులాం హసన్ అనే ఒక పర్షియా దేశ యాత్రికుడు ఆ చెరువు ఎల్లప్పుడూ నిండుగా వుండేదని దీనిని వర్ణించాడు. అది 1925-26 వరకు



ఎప్పుడూ అన్ని కాలాలలో నిండుగానే ఉండేదట. ఆతర్వాత ఎండిపోయింది. ఈ అద్భుతం జరిగిన తర్వాత ఆమె ఖ్యాతి వ్యాప్తి చెందింది. ఆమె ఇంటిని వదలిపెట్టి చివరికి శరీర స్పృహలేని దిగంబర యోగిని అయింది.

"నాగురువు నాకొక మాటనే చెప్పినాడు, 'బాహ్యదృష్టి వదలి అంతరాత్మను చూడు. ఈ మాట నాహృదయానికి హత్తుకుంది. బాహ్యశరీరం నగ్నమై నాకు తెలియడం లేదు" అని అన్నది. తనగురువైన శ్రీకంఠసిద్ధుడు ధ్యానం చేసుకుంటూ ఉండగా ఆతడి ఆంతరంగిక స్థితిని తన దివ్య దృష్టితో చూసి ఆతడి మనస్సు ఆతడి గుర్రాన్ని వెదుక్కొంటున్నదని అధిక్షేపించింది. ఆమె గురువు సిగ్గుపడి సత్యాన్ని ఒప్పుకున్నాడు. తపస్సు ఏలాగుండాలో ఆయనకు చేసి చూపి బోధించింది. ఆమె తలపై ఒక నీటి కుండ పెట్టుకొని పాదాలకింద మరొక కుండను పెట్టి ఒక పక్షం రోజులు అమావాస్యవరకు నిలబడి ధ్యానించింది. ఆమె శరీరం పూర్తిగా క్షీణించి కింది కుండలో కాస్త తెల్లని మెరుపు కదలాడుతూ కనిపించింది. ఆధ్యానం అట్లా చేస్తూనే పోగా పూర్ణిమ నాటికి చంద్రుడు పూర్ణుడయ్యేసరికి మళ్ళీశరీరం యథాప్రకారంగా పొష్టవం చెందింది. ఆమె గురువు "నీశరీరం పూర్తిగా క్షీణించిన వెనుక కింద కుండలో మెరుపు మిగిలిన దేమని ప్రశ్నించాడు. "అది నేనే" అని ఆమె సమాధానం చెప్పింది. దేహము, మనోబుద్ధి చిత్త అహంకారాలు, ఇంద్రియాలు వీటినన్నింటిని వర్జించిన తరువాత కూడ మిగిలిననాలో ఈశ్వరుడు నన్ను స్వీకరిస్తాడా అని ఆందోళన ఆ మెరుపులోని కదలిక, ఎంత తపస్సు చేసినా చివరకు ముక్తి అనేది ఈశ్వరుని దయపైనే ఆధారపడి ఉంటుందని ఆమె చెప్పింది. పీర్ గులాంహసన్ వ్రాసిన దానిని బట్టి ఈ సంఘటన తరువాత అనేక మంది ముస్లింలు ఈశ్వర తత్త్వాన్ని ఆమె నుంచి గ్రహించారు.

"విగ్రహాలను పూజించడంలో మత సంబంధమైన కర్మలను చేయడంలో తృప్తి పడకండి సర్వత్రా వ్యాప్తి చెందిన శివుడిని కర్మలతో కాక అంతరంగంలో ధ్యానించి చూడమని" బోధించింది. తపస్సుకు రమణులు ఇచ్చిన నిర్వచనం లాంటిది ఈమె మతం. ఈమె సుమారు 71 సంత్సరములు జీవించి ఉండవచ్చని ఒక అంచనా శ్రీనగరానికి ఆగ్నేయ దిశలో 28 మైళ్ల దూరంలో జమామసీదు గోడవెనుక ఆమె తన దేహాన్ని వదిలింది. మొహమ్మదుద్దీన్ ఫాక్ అనే రచయిత ఆమె శరీరంలోంచి ఒక దివ్యమైన తేజస్సు బహిర్గతమై అంతర్ధానమైనదని, అనేక మంది అది చూశారని

వర్ణించాడు. ఆమె ఒక పెద్ద పాత్రలో తాను కూర్చొని తనపై మరొక పాత్రను మూత పెట్టుకొన్నారట. ఈ వింతను చూసిన కొందరు పై పాత్రను తొలగించి చూడగా ఆమె లేదట. ఈ విధంగా ఆమె శరీరం అదృశ్యమై ఒక తేజస్సు కనబడి అది కూడా అంతర్ధానమైనది. ఆమెకు ఒక సమాధి కాని ఆలయం కాని లేదు. ఆమె భాద్రపదపూర్ణిమ నాడు జన్మించి ఫాల్గుణ శుక్ల అష్టమి నాడు ఈ లోకాన్ని వదలింది అని ఒక గ్రంథం చెప్పుతోంది.

ఆంధ్రదేశంలోని వేమనవలె హిందూసంఘంలోని విగ్రహారాధన, ఉచ్చనీచాల పరిగణన, మరికొన్ని మూఢ నమ్మకాలు వీటిని ఖండించింది. మాంసాహారాన్ని దూషించింది. పశువధ పాపమని చెప్పింది. దయ, ప్రేమ పవిత్రతను బోధించింది. మానవత్వాన్ని, వివేకాన్ని బోధ చేసింది. ఆమె బోధలు సర్వమానవులకు అన్వయించేవిగా ఉండడం చేత మానవ సౌభ్రాతృత్వాన్ని ప్రధానంగా బోధించడం చేత అనేక మంది ముస్లింలు కూడా ఆవిడను గురువుగా భావించారు. షేక్ నూరుద్దీన్ ఋషి అనే మహ్మదీయుడు ఆమె మార్గాన్ని అనుసరించి ప్రజలకు ప్రబోధం చేశాడు. ఆమె సమాధిస్థితిలో నిరంతరమూ ఉంటూ తాను శివ శక్తులను ఒక్కటిగా హృదయము నందే చూశానని, తనకు కనబడుతున్నాదని తన యోగానుభవాలను అక్కడక్కడ మాటలలో వ్యక్తం చేస్తూ, ఒక చూపు చేత ఒక వాక్యం చేత అనేకమందికి యోగస్థితిని ప్రసాదించింది. ఆమె తర్వాత కూడ అనేక మంది ముస్లింలు ఆమె బోధలను అనుసరించారు.

లల్లాదేవిపరిచయం తెలుగు భాషలో నేటి వరకు లేదు. ఆమె వాక్కులను తెలుగుభాషలో అందించడమూ నేటి వరకు జరుగలేదు. లల్లా వాక్కుల యొక్క ఆంగ్ల భాష అనువాదం ఆధారంగా ఉభయ భాషా వేత్తలు, కవి పండితులు శ్రీ శివశ్రీ మల్లంపల్లి శరభేశ్వర శర్మగారు అతిసరళమై మధురంగా పాడుకోవడానికి వీలుగా ఉండేటట్లు తెలుగులో అనువదించారు. తత్త్వ ప్రబోధకమైన ఆమె మాటలు ఇంత సులభమైన తెలుగులో చెప్పడం వీరికి మాత్రమే సాధ్యమైనది. ఇది తెలుగు వారి భాగ్యము.

కం॥ శివానందమూర్తి

వరంగల్లు

తేది : 20-2-1997

శ్రీ లల్లాదేవి వాక్కులు

అలమటింపఁగ పెద్దలాఁకట
బులియ మూర్ఖులు బొజ్జ నిమురుక
కర్మపాశచ్ఛేద మెపుడని
కాఁచికొని యుంటిన్ ॥ 1

వచ్చితిని నిడుబాటఁ బడినే
నిచ్చటికి ; నిడుబాటనేగెద
మ్రుచ్చిలించెదరెవరు ? శివునే
నచ్చముగ నమ్మన్ ॥ 2

ఏక సూత్ర ఘటిత నౌక సాఁగెదను గ
న్నాకు వోలె శివుఁడె సాఁకు నన్ను
పచ్చికుండవోలెఁ గ్రచ్చి నీరమ్ముల
నిడిసిపోక మున్నె యిల్లు సేర్చి ॥ 3

ఉఱుములకు మెఱుములకు నులుకకయె తలఁకకయె
పట్టపగటనె క్రమ్ము దట్టంపు టిరులకును
నరుఁడు తిరుగలిలోన నలిగి నెమ్మదిజాఱు
నుఱుమువలెఁ దుదకొందు నెచ్చి నిర్మల శాంతి ॥ 4

పదరఁగనిమ్మి పలుదుర్భాషలు
పదిలము నాయెద భవనిలయంబిది
చెదరఁగఁ బై పై చెత్త చెదారము
కగ్గనె వన్నియు ? నిగ్గుటద్దమున ॥ 5

తెగడెదరు గాక వగవగలఁ బిల్తురుగాక
తమతమ స్వభావములు దాఁట నెవ్వరి వశము?
పొగడెదరుగాక నను పూజించెదరు గాక
సొగయు ; నిర్మల బోధసుధలాని మైమఱతు ॥ 6

తొడిగినడుగుకె తెలియు తొలిచెప్పు కాటెచటొ
గడప గడపకుఁ దిరిగి బడలినను ఫలమేమి ?
జోలె నిండిన వెల్లజాలె మాఁపులఁ జూడ
నా సొదకుఁజెవి యొగ్గు నరమానవుఁడె లేఁడు ॥ 7

పాలుపోసి పెంచనేల వేముల ? పాము
గ్రుడ్లు పొదుగనేల ? కూర్మిఁ దెచ్చి
నాటనేల చవుట నాణెంపు విత్తులు ?
కుడుము లేల నేఁత వడిపి వండ ?
కఱటి నేల బోధపఱుప వేసడముల
గముల నేల చెఱకు గడలమేఁప ?
వాని కర్మవెంట వాని జ్ఞానపుఁబంట
ఏల వేసరింప జాలిపెంచి ? 8

తెలిసి జడులును కనియు నంధులు
వినియు బధిరులు నిలుతు రెచ్చటొ
విమల తత్త్వాభ్యాసమలవడు
వేత్తలీ జగతిన్ ॥ 9

రాకరాక మనుష్య జన్మము
ప్రాఁకులాడను భాగ్యములకై
చీఁకు చింతలు చేరవెన్నఁడు
శివుఁడె మదినిండన్ ॥ 10

శివుఁడొ విష్ణువొ జినుఁడొ కానీ
పిలువ పేరేదైన నేమీ ?
ఆజవంజవ రోగపీడిత
నబల నను బ్రోవన్ ॥ 11

మదిరయో మాంసంబొ పూజా
విధికి నెయ్యదియైన నేమీ?
దహరగుహ ఓంకార ముఖరిత
కుహరమై యుండన్ ॥ 12

మాయ జగమునఁ జిక్కి 'తన్నే'
మఱచి కట్టిన యిసుక మేడల
నీడ నిలువఁగ నెంతు వెంతటి
బేలవే మనసా ! 13

ఎంచి నిజమని యెండమావులు
పెంచి మమతలు పరువు లెత్తిన
త్రెంచరానివె సుమ్మి తుదకీ
జన్మ వలయమ్ముల్ ॥ 14

ఏటిగట్టున పొద్దువాలెను
బాట తప్పితి కాసులేదిఁక -
దాఁటఁబెట్టెడు వాని కెయ్యది
తడయకేనిత్తున్ ? 15

విల్లుసెలసుది ఔల్లు తూఁపులు
ఇల్లు జడునకు నిల్లడంబిడి
మొల్ల మంతయుఁ గొల్ల వోయితిఁ
జెల్లరే ! పాటుల్ ॥ 16

ఎటనుండి ఏదారి నేతెంచినానొ
ఎట కేగవలయునో ఎదియొ నాత్రోవ
ఎఱిఁగింతు రెవ్వరిట కరుణించి నన్ను
పసిమాలి నాయూర్పు సమయుచు నుండె ॥ 17

మేని తొడుసున(గాన నయ్యెద
నీవు నేనను నికరమును శివ !
మాన దందున సంశయము నా
కేను నీవెవరో ! 18

కల(గనేటికె బేలమనసా !
కలుగ నీకై యభవు(డే భవ
జలధి దా(టింపంగ; నెపుడో
పిలుపు వీతెంచున్ ॥ 19

అంధ బధిర న్యాయమున భవ
సింధుమధ్యమునందు నిలిచీ
అంధకాంతకు పిలుపువిని నే
హారతయ్యెదనూ ॥ 20

మో (పుగానిడె గురు(డు నాపై
నీ పగిది మధురేక్షు ఘటలను
ఓపలేనీ బరువుమోయ(గ
వీ(పు విక్కనియెన్ ॥ 21

కత్తి విడిచిన రాజ్యసుఖమును
చిత్తమణ(గిన దివ్యసుఖము ; గు
రూత్తముని పలుకూ(ది నడిచిన
హత్తవి(క కర్మల్ ॥ 22

వేమఅడిగితి గురుని శూన్యము
నామ మేమని అలసి యలసి ; అ
నామముననే వెడలెనట ! మఱి
యీ మహాద్భుతముల్ ॥ 23

లోని కరుగుము బయట విడి యటఁ
గాననగు శివు నన్ను వాక్యము
లోనె ఆవరణములు వీడిన
నేను నర్తింతున్ ॥ 24

నాభినిర్గతమైన 'ఓం' కా
రాభితో నాదం బజాండమె
బూరటింపఁగ నన్య మంత్ర వి
చార మింకేలా ? 25

ఇడయు పింగళయును సుషుమ్నయు
పిడికిలించుచుఁ గ్లేశముల పొడి
పొడిగఁ గలుపక యోగరస మల
వడునె తెక తేరన్ ? 26

గగనగతి యగు చిత్త తురగం
బెగయ యోజనలక్ష లోక త్రుటి
బిగియు కళ్లెము ప్రాణధృతియై
తరటుగొను బుధుఁడే ॥ 27

లీలమూయుచు లోని వాఁకిళు
లోలిఁబట్టుక ఊర్ధ్వదొంగను
కాలుసేతుల కట్టి ప్రణవపుఁ
గోలమోఁదితినీ ॥ 28

వెదకి వేసరి 'లల్ల' లోయెద ఁ
గదిసి శివుఁగనఁబో నదాటుగ
గడియ యిఁజియఁగఁ బెట్టుకొని లో
మృడుఁడు తానుండెన్ ॥ 29

ప్రాణ పాణింధమము లొత్తినఁ
గాననయ్యెఁ దమోంతరమ్మున
లీన భాను సహస్ర మొడిసితి
లోని దీపంబున్ ॥ 30

శిశిర ఘన హిమశీకరమ్ముల
వశమె పిడికిటి నొడియ ననిలము,
వశిజనైక గ్రాహ్యమాత్మయు
ప్రశమసాధ్యం బే ॥ 31

వాలగా జాబిల్లి జాలిగా నాగుండె
వాలుగా నొఁక పాట జాలు వారినదీ
చాలనే నిను వెదుక 'లాలసను' 'లాలసను'
మేలుకో నావెలుఁగ ! మేలుకో వెలుఁగ ! 32

ఎఱుక ఁ గొని తనలోనఁ గరఁగుము !
ఒరిమజలముల నుప్పు వోలిక
దొరకునే శమ దమములబ్బిన
నెఱుక తెకతేరన్ ? 33

కానలాఱును గడవ శశికల !
ప్రాణలీనమొనర్చి ప్రకృతిని
మానసమ్మును భక్తి వేలిచి
నేను శివుఁ గంటిన్ ॥ 34

కరఁగి అభ్యాసమున దృశ్యము
పరమ గగనంబైన సాక్షి -
స్ఫురణ మొక్కఁడె మిగులు నచ్చట
నది అనామయమౌ ॥ 35

మాట లేదట మనసు లేదట
వెలయ వచ్చుట వివిధ ముద్రలు
కులము నకులము శివుఁడు శక్తియు
విలయమగు నచటన్ ॥ 36

తంత్రమణఁగెను మంత్రమందున
మంత్రమణఁగెను చిత్తమందున
చిత్తమణఁగిన దృశ్యమంతయు
శివుని యందణఁగెన్ ॥ 37

చిత్త తురగపు వాఁగె ప్రాణమ
రుత్తు నొఁత్తితిఁ బదియు నాడుల
హత్తి శశికల కరఁగఁ గలిసె వి
యత్తె తాఁ దనలోన్ ॥ 38

వెఱవకయె లోభాది రిపులకు
దొరకొనిన లోలో విచారము
కరఁగుటయె సుమి బయలు బయలున
నఱమఱలు లేకే ॥ 39

దరిసి హృదయపు (దోఁట లోలోఁ
గరఁగ శివుఁడును శక్తి యొకరై
పరమమగు నమృత హ్రదమ్మున
మఱచి జగముంటిన్ ॥ 40

రవి యణంగిన శశి వెలింగెను
శశియు మాసిన మిగిలె నెఱుకయు
నెఱుక సురిగిన తోన సురిఁగెను
బెరసి ముజ్జగమున్ ॥ 41

అరసితిని గడు నలసి నను నే
విరళ జనసంపాత పథమున
నురుగులారెడు నమృత భాండము
లొకరు లేరానన్ ॥ 42

నీవు లేవట నేను లేనట
ధ్యేయమును ధ్యానంబు లేదట
భావమంతయు (దానె తనలో
లీనమై యుండన్ ॥ 43

విమల జలములు హిమజడములై
హిమము శిలయై యెండ సోఁకిన
కరఁగులీల చరాచరంబులు
శివుఁడుగా (గరఁగున్ ॥ 44

పగలు మాయఁగ రేయి మూయఁగ
గగనపృథువుల నొకట; రాహువు
శశి గ్రసించిన చెడక లోయెద
శివుఁడు వెలుఁగొందున్ ॥ 45

మలిన తనువున కంటి నిను ని -
ర్మలిను నా బ్రదుకెల్ల వెదకుచు -
అలసి నాలో నరసి శివ! నినుఁ
గలసి సుఖముంటిన్ ॥ 46

ఇల్లు వెడలితి 'లల్ల' నేనూ
రెల్ల వెదుకఁగ విభుని నాదగు
నుల్ల మను నుయ్యాలలోనే
ఒదిగి శివుఁడుండన్ ॥ 47

తుడిచి కనుగొన దూఁగఱలు నా
యెడఁద యద్దములోఁ దళుక్కనె
మృడుఁడు; సురిగితి, మేను, జగ, మె
ల్లెడలనున్ శివుఁడే ॥ 48

సచ్చిదానందమున బంధము
విచ్చి జీవన్ముక్తి నలరక
గ్రచ్చుకొని భవపాశముల ముడు
లచ్చుకొననేలా ? 49

ప్రాణలీన ప్రణవధారణ
లోన దగ్ధములై షడధ్వలు
పూని సత్పథ మే ప్రకాశ
స్థానమును గంటిన్ ॥ 50

ద్వాదశాంతస్థితిని ప్రాణం
బూఁదు శివుఁడే తాన యైనపు
డేది తంత్రం బేది మంత్రం
బేది దైవంబున్ ॥ 51

పేర్చితివి శిల లాలయంబని
చేర్చితివి శిలనందు శివుఁడని
కూర్చి ప్రాణానిలము మనసున
నేర్చి శివుఁ గనుమీ ! 52

ధూప దీప నివేద్య కుశ కుసు
మోపహారములకును మించి, గు
రూపదేశ ధ్యాన నిష్ఠయె
పాపు భవరుజలన్ ॥ 53

గగన మవనియు గాలి నీరును
పగలు రేయును బర్వి నీవే
నెగడ నెల్లెడ నిండి శంభువ !
మిగిలి లే దెదియున్ ॥ 54

ఇందు శేఖర ! నీకు పూజా
చందనాక్షత కుసుమ పరికర
మింద మనుటకు నేర; నిన్నిట
ముందె నీయునికిన్ ॥ 55

వారిపూర్ణ సరోవరము ము
మ్మాఱు చూచితి మిన్నులంటఁగ
నారసితి శూన్యమ్ము వరుసనె
ఏడు మాఱులుగన్ ॥ 56

ఆవగింజ మునుఁగదా సరస్సున దాని
జలము తోనె పెరుగు సకల జీవ
వితతి, అంతకంటె విస్మయం బద్దాన
మునిఁగినంత మఱలఁ బుట్టుచుండు ॥ 57

అయిదు పదియును పయిన నొక్కటి
వాదుగొని యెడపెడకు లాఁగిన
నేది తెరువీ మొదవునకు నొక
దారిఁ బయనింపన్ ॥ 58

జలకము లాడుచుఁ జెలఁగి నవ్వుచును
పలువగలును గొని పనులు సేయుచును
పొలయు శివుఁడు నీ తను గృహమందే
తెలియు మాతనినిఁ దేఁట తెల్లముగ ॥ 59

మునిఁగినంతనె తీర్థముల మును -
కొనునె మోక్షము జ్ఞాన గమ్యము ?
కనఁగ దూరపుఁ గొండ లెంతయు
నునుపుగాఁ దోఁచున్ ॥ 60

మూలాధారములో సురకరిపై
సోలి శయించిన దేవి మేల్కొనక
నీరిడి పెంచిన కూర పెరడు లివి
ఆఱడిపోవే యూరి పసులచే ! 61

ఆరసి నాలో రాకా చంద్రుని
నారు బయట నేనారసి నంతనె
నారాయణుఁడిట -నారాయణుఁడట -
నారాయణుఁడే యెల్ల దిశలలో ॥ 62

శివుఁడు గుఱ్ఱము జీను విష్ణువు
పంకజాసనుఁ డంకెవన్నియ
పొంకముగపై స్వారి చేసే
అంకకాఁ డెవరో ! 63

అశ్వసాది అనాహతధ్వని
శశ్వదుదితము నాదబిందువు
స్వస్వరూప మనామ వర్ణము
శూన్యనిలయంబే ॥ 64

గురుపరమేశ్వర ! కృపశ్వాసమ్ముల
తెఱఁగెఱిఁగింపవె నాభికందమున
సరి నిరుతెఱఁగుల వెలువడు హేతువు
కుఱచ చల్లనై నిడుద వెచ్చనై ॥ 65

రవి నివసించును నాభికందమున
శశినిలయం బగు బ్రహ్మరంధ్ర మది
నిడుపును వేఁడిమి నిఁగుడును రవిచే
చలిమిఱి కుఱుచన సాఁగును శశిచే ॥ 66

ఒకరు మేల్కొనియుండఁగా వేఱొకరు నిద్దుర వోదు రెవ్వరు ?
నికరముగ నేప్రొద్దు నింకక నిగుడు జెల యేనీటి బుగ్గను ?
ప్రకట శివపూజార్హనిర్మల పావనాంభోభరము లెయ్యవి ?
సుకరముగ శివుఁగలయ వీలగుచోటు తానెచ్చోట దొరకును ? 67

శివుఁడు మేల్కొనియుండ మనసిది చెఱిగి నిద్దుర వోవుచుండును
నిగిడి కరణద్వారముల నెడ తెగకపాఱును విషయవాహిని
ప్రవిమలాత్మవిచారధారాప్రసరణంబే పరశివాంబువు
ప్రణవసౌధము లోని కరిగినఁ బరమశివుఁ గలయంగ వీలగు ॥ 68

మాలకరి యెవ్వఁడాతని మగువయెవరు ?
పూవులెయ్యవి దేవర పూజలకును ?
మజ్జన జలంబు తెచ్చుటే మడుగునుండి ?
మంత్ర మెయ్యది నిశ్చల మననమునకు ? 69

మానసమె మాలకరి, కోర్కె మగువ తాను,
వారు తెచ్చిన విమల భావనలె పూలు
స్వానుభూతి హ్రదాంబులె స్నానవారి
మౌనమే మననోచితమంత్ర మరయ ॥ 70

ఎన్నుకొనుచును రేయిపగలును
సన్నుతంబుగ హంసమును దా
నున్న యట్లే యుండి కను శివు
సన్నిధానంబున్ ॥ 71

శివ శివ శివ యని చెదరక పలుకుచు
ప్రవణమతిం దన హంసంబరయుచుఁ
దివిరి రేవగలుఁ దిరిగియు జగమునఁ
దవులక మెలఁగుట తా నద్వైతము
మివులన్ మెచ్చును శివుఁడు వానికిని॥ 72

తాను పరుఁడని రేయి పగలని
పూను భేదము లెల్ల నద్వై
తాను భవమునఁ గరఁగు నెవనికిఁ
దాను శివుఁజూచున్ ॥ 73

బిగియఁబట్టుక ప్రాణముల నే
నెగచి యల్లన జ్ఞానదీపిక
నెఱుకఁగాఁ గనుగొంటి లోలో
శివు నిరామయునిన్ ॥ 74

అమలమానందమయము నిరామయంబు
జ్ఞానరూపంబు చిత్ప్రకాశంబు దొరకు
ధీరులకుఁ గొందఱికి వారు దేహమందె
ముక్తు ; లితరులు పుట్టుచుఁ బొలియుచుంద్రు ॥ 75

ఇనుఁ డస్తమించిన నిందుబింబము వెలుఁగు
వెలుఁగు చిత్తంబు జాబిలియు మాయంగ
చిత్తంబు మలఁగిన క్షితి మొదలైన
దృశ్యప్రపంచం బదృశ్యమై సురుగు ॥ 76

ఒడలు మొదలుగా నొఱ లాఱిటిలో
నడుగునఁబడ్డి నిన్నరయలేక కడు
బడలితి నేఁడీ తొడుగులన్నిటికి
విడుమరగా నిను మృడ ! పొడగంటిని ॥ 77

తివిరి శివునిఁ గనఁ దీర్థము లాడుచు
మివుల బడలి పయి మిన్నక నిలిచితి
వివరింపఁగనటఁ ద్రివిధవరణముల
నవల మానసము నడుగునఁ జొచ్చితి ॥ 78

కవయ శివుని నటఁ గార్మికమాయా
ణవ వరణములను నలి భేదింపఁగ
శివుననుగ్రహము చేపడినందున
పిలిచె 'లల్ల'! యని చెలఁగి జగమ్ములు ॥ 79

వదలి యేమగు నిల్లువాఁకిలి?
కదలి యేమగు కాననములకు?
పదిలముగఁ దనలోనఁ జిత్తము
కుదుట పడకున్నన్ ॥ 80

ఓలిన కాలమన్న వల నొక్కొక ప్రోఁగుగ లాఁగ నేర్చినన్
బైలయినంత నింటనయినన్ విపినంబున్నైన నేమి స
ర్వాలయ మొచు నిర్మలినమై తగు నాత్మనెఱింగి నెమ్మదిన్
పోలిన లీల నిల్చునది ; ముక్తున కిట్లని నిర్ణయంబటే ! 81

విడువక వచ్చుచుంటిమిని వెళ్లుచునుంటి మనాది నుండియున్
బుడిబుడి నిట్లు వచ్చుటకుఁ బోవుట కేమిది తూఱుపిల్లునున్
పడుమటి యిల్లె ? ఆ వెనుక పట్టున గుట్టొకఁ డేదొ దాఁచఁగాఁ
బడె నదియేమియో తెలియఁబట్టుటె పుట్టుటకున్ ఫలంబిటన్ ॥ 82

పరిపరి విధములఁ బడి చెడిపోవక
అరుగుమి ! తిన్నఁగ నమృతపథమ్మున
జనని అంకమున స్తనదుగ్ధమ్మును
నెనరునఁ గ్రోలెడి నిసువు పోలికను ॥ 83

బరువుగ భుజించినను పడదడుగు ముందునకు
నెరి నిఁట్రుపాసములఁ గరమహంకృతి పెరుగు
సరి భుజించిన నాఁడె నిరపాయముగ పొఁగి
పరమ గమ్యము సేరు చిరయోగ పథికుండు ॥ 84

చలికిఁ గొనుమీ ! వసనమును, నాఁ
కలికిఁదినుమీ ! అశనమును, మతి
మలిన ముడుపుచు నుండు మెన్నఁడు
వలదు సుఖచింతల్ ॥ 85

దారిద్ర్యముచ్చులు కాముఁడాదిగ
నాలుగురిఁ దెగటార్చి సుఖములఁ
బాఱఁజిమ్మిన నాఁడె శివునెద
ధీరుఁడై తలఁచున్ 86

నిలిపి కుంభకమునను ధృతి, నాఁ
కలియు దప్పిక మొదలు వెలిజగ
మలయికల లోఁబడక యెన్నఁడు ఁ
దొలఁగు జన్మలకున్ ॥ 87

ఇచ్చి పుడమియు నెడఁద తనియదు
పుచ్చుకొని లోభంబు నుడుగదు
జీవభావము; లోభమణఁగినఁ
జావు లేదెపుడున్ ॥ 88

తినుట తొడుగుట లనిన వేసరి
మనసు విరిగిన వారు ముక్తులు;
ఉత్తమర్ణులఁ గొనక 'యత్కిం
చిత్తు' ఋణముక్తుల్ ॥ 89

మేలుకొను కూర్కుచునె యొక్కఁడు
మేలుకొనియే కూర్కు నొక్కఁడు
గంగ మునిఁగియు నశుచి యొక్కఁడు
సంగియై శుచియే ॥ 90

అలిగి మనసిది అగ్గివలె నగు
నలిగి క్రుంగును నలుసు పోలిక
కలఁగు టెఱుఁగని అచ్చుతెలివియె
వెలయు తన రూపై ॥ 91

శీల శిక్షకు మానరక్షకు
చాలు నిపుణులె చాలెదరు ధర
గాలిఁ గైకొని పట్ట, నేనుఁగు
నూలితోఁ గట్టన్ ॥ 92

ముదిమి పైకొనె సడలె నొడలిఁక
కదలి వచ్చిన కడకె పోనగు
పొదల దేదియు శాశ్వతంబయి
పదిలముగ నిచ్చోన్ ॥ 93

వచ్చి జన్మ కిట వారక కంటిని
అచ్చపుఁ దెలివిని అతి సహజముగా
చచ్చెద నెపనికి ? చత్తు రెవ్వరిట
చచ్చుట చావమి సమమై యుండఁగ ॥ 94

నీలకంధర ! నియతి విద్యలు
కాల కళలును రాగమాయలు
ఆఱిటికి ధారవీవు ; నే నీ
యాఱిటికి లెంకన్ ॥ 95

గహనములలో రాని మోక్షము
గృహములందున రాక నిలుచునె?
విహిత మాత్మ విచారమే అ
న్వహము నెట నున్నన్ ॥ 96

శిల యొకండే గోపురము గుడి
వెలయు పీఠము వేలుపునునై
చెల(గు విధమున శివు(డొకండే
కల జగంబెల్లన్ ॥ 97

సీమసీమల సూర్యకరములె
గీము గీమున వ్యోమజలములె
జీవి జీవియు లోన పరశివ
చేతనయె వెలు(గున్ ॥ 98

పాలొసంగును తల్లియై స్మర
కేళి(దేల్చును దరుణియై స్మృతి
జాల మెడపును మత్యువై శివ
లీలయే జగతిన్ ॥ 99

పూజయే నేనేది యొనర్చిన
తా జపమె నేనేది పలికిన
ఓజమెయి తంత్రంబె నాకెది
యోగ లబ్ధంబౌ ॥ 100

మాతృగర్భస్థితి వినిర్గతి
యాతనల(బడి పొరలి పుట్టుచు
వేసటెఱు(గక స్త్రీ సుఖమునకె
వేడ్క పడనేలా ? 101

నీరవహ్ని స్తంభనమ్ములు
కేరి గగనము నందు నడచుట
దారుధేనువు పిదుకు టిన్నియు
భూరి కైతవముల్ ॥ 102

పట్టమునఁ గోల్పడిన సొమ్మది మట్టమందునఁజేరియున్నది
నెట్టనన్ వచియింతు రిట్టులె బొట్టె యోగులు కొందఱిలలో
పట్టువడకయె యోగసిద్ధులు పట్టువడెదరు వెరవెఱుంగక
నెట్టుకొని నామాట నరయుము నేర్పరివెయైనన్ ॥ 103

భరపడి యేలఁ దాల్పఁడొకొ ! ప్రస్ఫురితాత్మమహస్సులోపలన్
వెరవిడి ! జ్ఞానసీధు వది వెక్కసమైనను వీనికిన్ గనుల్
తిరుగునొ ! ఆంతరస్ఫురిత దీధితి నెక్కొనువేళ, నిట్టుల
స్థిరమతి, సంయమిప్రకర ధీరచరిత్రము వీటిఁ బుచ్చెడున్ ॥ 104

చదువ సులభము సేయ దుర్లభ
మదియుఁ గనుగొన నాత్మవస్తువు
చదివి మఱచితి సాధనంబడి
పదిలపడె ప్రజ్ఞల్ ॥ 105

సారంబెఱుఁగక పంజర
కీరమ్ముల వోలె జనులు కేరుచు గీతా
పారాయణ మనెదరు భా
వారూఢిన్ గనఁగ వలదె ? అది ప్రత్యహమున్ 106

చదివినదెల్ల నాచరణ సాధువుగాఁ గణితించి కొంటి, నేఁ
జదువని దానికేమి? రభసమ్మున లాగితి జాలు పట్టి బె
ట్టిదము నరణ్యసింహము దొడిందొడి జంబుకమట్లు,చేసి చె
ప్పెద; నిటు బోధమొందితి వివిక్తము గమ్యము చేరఁగాంచితిన్ ॥ 107

అడవుల పూరితో, పడియ యంబువుతో, నొడలోమి మేనురా
ల్చెడు నెడనైన, నిన్ జలికి సిగ్గునకగ్గము గాకయుండ, మై
తొడుగిడి కప్పికాఁచుఁ గృపతో, మఱి తోటిది నిండు జీవమున్
జడశిల కప్పనంబుగను జంపెడు నుల్లము గట్టి యెట్టిదో ! 108

అరయమిలోఁదవుల్కొని భవాంబుధి మున్గితివేల ; జ్ఞానపుం
దెరువున జాఱి యేమిటికిఁ ద్రెళ్లితి చీఁకటి యూబి లోనికిన్?
దఱియగునంత నీడ్తురు గదా యమదూతలు ! నెత్తురొల్క,నె
వ్వరు నిను మృత్యుభీతికిని (బాపెద, రేమఱియుండఁ జెల్లునే? 109

ఛత్ర చామర సింహపీఠీ
నృత్త గీత వినోదకేళులు
మిత్తి పైకొన నాఁగి యోపవ
యుత్తరింపంగన్ ॥ 110

సుకృత దుష్కృతములన రెండివి సొరిది సుఖ దుఃఖావహమ్ములు
ప్రకట కార్మిక మాయికాణవ ప్రకృతులను జనియించు మూఁడిట
నికరముగ నీయెదు కుంభక నిభృత ధారణ దాఁటి, నాభి
ప్రకట రవి భేదించి యరిగినఁ బాయు మృత్యుభయంబు జనునకు ॥ 111

జ్ఞానమను మడికట్టి డెందము
లోన హత్తుము 'లల్ల' పదములు
ఊని ప్రణవము 'లల్ల' జ్యోతి
ర్లీనయై వెలసెన్ ॥ 112

తెఱచి యీ భువికన్నులను నే పఱచితిని పది దిక్కులరయఁగ
పరువులెత్తితి నంబరమునఁ బ్రభంజనము వలె మాఱుమ్రోయుచు
అరయ నబ్బురమయ్యె బయల జరాచరములవి యెల్ల శివుఁడే!
మురిసి మెయి వాఁకిళ్లు తొమ్మిది మూసి కనుగొన లోన శివుఁడే ! 113

కరువునందిడి కరఁచి పయి దాఁ
కలిని సాఁగంగఁ గొట్టిన
కసటు వాసిన పసిఁడి వోలిక
పసిమి మీఱితినీ ॥ 114

కరడు గొన్న హిమమ్ము లెండకుఁ
గరఁగినట్టులు భక్తి వేఁడిమిఁ
బొరసి యణువణువందు నిలువునఁ
గరఁగి నీరయితిన్ ॥ 115

గళిత తుహినావరణ నిర్మల
జలజబంధు ప్రభల వెలిఁగెడు
లలన పేరది 'లల్ల' మదిలోఁ
దలఁప శివు పేరే ॥ 116

అరిగిన కొలందిని నిరామయంబగు బయల
పొరి నెచ్చటనొ జాఱె బుద్ధియును మై యెఱుక
అరసినది తనదౌ రహస్య మేదియొ 'లల్ల'
నెరయు పంకము నుండి నెత్తమ్మి విరిసినది ॥ 117

చెలువ చిత్తము క్రొత్త శశిరేఖయును గ్రొత్త
చెలువ నెమ్మేయి క్రొత్త జగమెల్ల సరిక్రొత్త
శివకృపాసలిలముల జలక మాడెను గాన
తవిలి, లల్లాదేవి తనకుఁ దానే క్రొత్త ! 118

BCi

YRKA108B152

BC

Sri Lalladevi Vakkulu

Tr. : Mallampalli Sarabheswara Sarma

Printed at : Lakshmi Graphics, Hnk. Ph: 77395

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	YRKA108B152
పుస్తకం పేరు	టే యూబివ్ గ ప్
తారీఖు	15 December 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	37
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	CiBCi
లేని పేజీలు	NO
తయారు చేసినది	vedavathi
పేజీలు విడదీసినది	[illegible]
స్కాన్ చేసినది	Nandini
పరీక్ష చేసినది	MADHU MATI
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good